# జీవితం

"సావిత్రీ! సా .... విత్రీ!"

వెర్రికేకల్లాంటి ఆ అరుపులు విని వంటింట్లో తాలింపుగిన్నె పొయ్యిమీద పెట్టబోతున్న సావిత్రి దాన్నికాస్తా దబ్బున ఎత్తేసి పరిగెత్తింది గదిలోకి. "ఏమిటి? ఏమైంది? యావైంది?" అంటూ.

"చూడు చూడు, గమ్మున. ఇక్కడేదో తెల్లగా...." అద్దంలోకి చూస్తూ జుట్టు పీక్కుంటున్నాడు రాంబాబు.

కంగారు పడిపోయింది సావిత్రి. "ఎక్కడా? నెత్తి మీదే! అమ్మో, ఏం వుంది?"

సావిత్రి భయం భయంగా మొగుడి బుర్ర ఒంగదీసి జుట్టంతా కెలికి చూసింది. "ఏవిటసలు? ఎక్కడా? ఏవీ కన్పించదేం?"

"ఇటూ .... ఇటూ ... పాపిడికి ఎడం వేపు తెల్లగా .... దారంలా ...."

"అయ్యో రాత! వెంట్రుకేదైనా నెరిసిందేమో!"

"ఛీ! పిచ్చిపిచ్చిగా మాట్లాడకు! ఏ దారం ముక్కో చిక్కుకుని వుంటుంది. సరిగ్గా చూడూ!"

సావిత్రి కళ్ళు రెండూ జుట్టులోకి దూర్చి వెంట్రుక వెంట్రుక్కీ మధ్యనంతా గాలిస్తూ నించుంది.

"ఏం, కనపడిందా?"

"ఉండండి, చూస్తున్నాగా? ఓయ్! ఓయ్! ఇదిగో దొరికింది, దొరికింది."

"ఏమిటి? ఏమిటీ? దారం ముక్కే!"

"చూస్తారుగా? కంగారెందుకూ? నాది పిచ్చి వాగుడు అన్నారే! ఇప్పుడు చెప్పండి చూస్తాను ఇదేమిటో!" — పుటుక్కున ఓ వెంట్రుక తెంపి అరిచేతిలో పెట్టుకుని రాంబాబు కళ్ళముందు పెట్టింది.

తుళ్ళిపడ్డాడు రాంబాబు, బిగుసుకుపోయాడు రాంబాబు, మాటలుడిగి .... చేష్టలుదక్కి .... గుడ్లప్పగించి .... కొన్ని క్షణాలు!

"ఎ .... ఎ .... ఏవి .... టిదీ?"

"తెలీటంలేదూ, మెరుగుపెట్టిన వెండి తీగలా, తెల్లగా తళతళా మెరిసిపోతోంటేనూ?"

"తె.... తె.... తెల్ల.... వెంట్రుకా? న్న .... న .... న్నా తల్లోదే?"

"బ్బె .... బ్బె .... నా .... జళ్ళోది."

బిక్క మొహం వేసేశాడు రాంబాబు. "నా జుట్టులో తెల్ల వెంట్రుకేవిటి! అప్పుడే!"

గలగలా నవ్వుతూ అంది సావిత్రి. "ఎందుకూ, అంత దిగులుపడి పోతారూ?"

చెడ్డ చిరాకు వేసింది రాంబాబుకి. "చాల్లే! వెకిలి దానిలా ఏంటా నవ్వు?"

"బాగుంది. ఉరుమురిమి మంగలం మీద పడ్డట్టు, మీ నెత్తిమీద వెంట్రుక నెరిస్తే నా మీద కోపవా? అయినా ఒక్క వెంట్రుక నెరిస్తే అంత బాధ పడటం ఏవిటి?"

"ఇప్పు డెవరు బాధపడుతున్నారు?" గాంభీర్యం తెచ్చిపెట్టుకున్నాడు రాంబాబు.

తెచ్చిపెట్టుకున్నది తెలుస్తూనే వుంది. ఎంత వద్దనుకున్నా మనసంతా బాధ ఆవరించుకొంది. అప్పుడే జుట్టు నెరవడం మొదలైందా? అప్పుడే పెద్ద వాడై పోతున్నాడాతను?

"నా మతి మండినట్టే వుంది. తాలింపు సంగతి మర్చిపోయి ఇక్కడ నించున్నాను" అంటూ సావిత్రి హడావిడిగా లోపలికి వెళ్ళబోయింది.

"మాట, మాట. ఒక్క వెంట్రుకేనా, అలాంటివి ఇంకా ఎక్కడైనా వున్నాయేమో కొంచెం చూడు" అంటూ సావిత్రి వెనకాల పరిగెత్తి బుర్రవంచేసి పెళ్ళాం ఎదరగా నించున్నాడు.

సావిత్రి జుట్టు కాస్త ఇటూ అటూ కెలికి నవ్వు ఆపుకుంటూ "అబ్బా, బుర్రనిండా వున్నాయండీ!" అంది.

"ఆఁ .... నిజంగా? ఎన్ని? ఎన్ని?" అని అరిచాడు.

ఫక్కుమని నవ్వేసింది సావిత్రి "ఛ! ఎందుకంత

భయం? ఒక్కటికూడా లేదు. సరదాకి అన్నాను."

"చాల్లే! ఏంటా మోటు సరసం?" అని మొహం ముటముటలాడించాడు. తెల్ల వెంట్రుకలు ఇంకేవీ లేవని చెప్పినందుకు చాలా శాంతించాడు.

"అదొక్కటి ఎలా నెరిసిందబ్బా? నిజం చెప్పు, నా జుట్టులోంచే తీశావా దాన్ని?"

"ఇది మరీ బాగుంది, నే నెక్కణ్ణించి తెచ్చాను దాన్ని?"

"ఆహాఁ, ఊరికే అన్నాలే! అన్నట్టు బుర్రలోంచే తెంచి తీశావా, జుట్టుమధ్య చిక్కుకుని వుంటే .... తీశావా?"

"ఇదేం చోద్యం? పుటుక్కున తెంచాను, మీకు నొప్పెట్టలేదూ?"

"అబ్బే! నాకేం నొప్పెట్టలా, అసలది నాది కాదేమో ...."

"అయితే అదెవరిది? నాదా? అదుగో, అక్కడే వుంది ఇంకా, చూడండి!"

'ఎన్నటికీ నేను నీ దానినే ప్రియా!' అంటున్నట్టు మిలమిల్లాడిందా రెండంగుళాల వెండి వెంట్రుక - రేడియో బల్లమీద.

"తాతగారూ!" ముద్దుగా పిలిచింది సావిత్రి కళ్ళలో కొంటెతనం చిందిస్తూ.

ఉలిక్కిపడి వెర్రివాడిలా చూశాడు రాంబాబు.

"పాపిట్లో నాలుగు వెంట్రుకలు నెరిస్తే మహా పతివ్రతలౌతారటగా? ఇక మీరు కుర్రతనం మాని బుద్ధిమంతులవ్వాలన్న మాట!"

భయపడ్డంతా అయ్యింది! ఆ మాట సావిత్రి అనేస్తుందని రాంబాబు గుండెలు గుబగుబలాడుతోనే వున్నాయి. అప్పుడే పెద్ద వాడై పోతున్నాడా తను? దీనంగా చూశాడు భార్యామణి మొహంలోకి. "మొన్నేగా ముప్ఫై ఆరోయేడొచ్చింది?"

"అయితే మాత్రం? వయసు వస్తోందా, పోతోందా? ఇంకా బాలా కుమారుణ్ణే అనుకుంటు న్నారా?"

"ఇంకా ఈ వయసుకి కొంతమంది పెళ్ళే చేసుకోరు."

"పెళ్ళి చేసుకోలేదని జుట్టు నెరవకుండా ఆగిపో తుందేమిటి? మనమేం దేవతలమా, అన్నిటికీ అతీతంగా వుండిపోడానికి?"

కుంగిపోయాడు రాంబాబు. పెళ్ళి చేసుకోక పోయినా వయసు ఆగిపోతుందా? రోజు రోజుకీ వారాలూ, నెలలూ, సంవత్స రాలూ పైబడటం లేదూ? జీవితం కొద్ది కొద్దిగా తరిగిపోడం లేదూ?

సావిత్రి ఎప్పుడో వంటింట్లోకి వెళ్ళి పోయింది.

రాంబాబు రేడియో బల్లకేసి భయంగా చూశాడు. వాడితప్పి బాగా నొక్కు నొక్కులు బడి ఎక్కడికక్కడ ముడుచుకుపోయి పడుకుందా తెల్ల వెంట్రుక, కసి కొద్దీ దాన్ని కిటికీలోంచి గాలిలోకి ఎగరెయ్యబోయి ఆగిపోయాడు. అసలది ఎందుకు నెరిసిందో! డాక్టర్‌కి చూపిస్తే? ఎందుకైనా దాన్ని వుంచటమే మంచిదేమో! ఫర్రుమని ఒక కాయితం ముక్కచింపి దాన్ని గబగబా పొట్లంకట్టి జేబులో కుక్కుకున్నాడు.

★ ★ ★

రాంబాబు మనస్సంతా వికలమై పోయింది. ఆ ఒక్క తెల్లవెంట్రుకా కళ్ళ ముందు తళతళలాడుతూ. బుసలు కొడుతూ మిడిసిపడుతోంది. అంతూ పంతూ లేని ఆలోచనల వేడితో బుర్రంతా సెగలు కక్కుతోంది. ఛ! తను తప్పు చేశాడు. అసలు సావిత్రిని పిలవ కుండానే వుండాల్సింది. చూసీ చూడనట్టు తల దువ్వేసుకుంటే ఎప్పుడో దానంతటదే రాలిపోయేది. తనకీ క్షోభ తప్పేది. క్షోభ అనుకుంటే కాదా?

"మొగ వెధవకింత జుట్టేవిటమ్మా! చాకిరీ చేసే సరికి రెక్కలు ముక్కలౌతున్నాయి. ఏటా ఒకసారి గుండు గీయిస్తే సరి" అంటూ చిన్నప్పుడు అక్క తల రుద్దేప్పుడల్లా విసుగుతో దిప్పకాయలు తీసేది.

చదువుకునే రోజుల్లో కాలేజీ అమ్మాయిల్ని ఆకట్టేసిన తన జుట్టుకి సామాన్యమైన చరిత్ర వుందా? "రాంబాబు గారూ! మీరు కేశ సంపదని కాపాడు కుంటోన్న రహస్యం చెప్పి పుణ్యం కట్టుకుందురూ!" అనేవారు అమ్మాయిలు నవ్వుతాలుకి. అప్పట్నించే కేశసంపద సంరక్షణ నిజంగా ప్రారంభించాడు. వారం వారం కుంకుడు కాయల్తో తలంట్లూ, కోల్డు క్రీములూ, నిమ్మరసం మర్దనాలూ వగైరాలతో.

సావిత్రి మాత్రం? ఎన్నిసార్లు .... తన జుట్టుని చూసి మురిసిపోలేదూ? ఇప్పటికీ అంటూనే వుంటుంది చిలిపిగా. "అసలీ జుట్టు చూసే మిమ్మల్ని పెళ్ళి చేసుకున్నాను తెలుసా?" అంటుంది. నుదుటి మీదికి జారిపడుతోన్న నొక్కుల మీద ముద్దులు పెట్టుకుంటుంది.... ఆ ముద్దు సుఖం .... వర్ణించ గలడాతను? ఈ జుట్టు .... కారు మబ్బులా .... కాటుక కొండలా .... చిమ్మ చీకటిలా .... తుమ్మెద రెక్కల్లా .... నిగనిగలాడే ఈ జుట్టు .... నెరవడం మొదలెడితే సావిత్రికి చీమకుట్టినట్టన్నా లేదు చూడు! ఈ తలంతా ముగ్గుబుట్ట అయిపోతే తెలిసొస్తుంది బాగా. ముగ్గు బుట్టని ముద్దులు పెట్టుకుంటుందా?

చటుక్కున దుఃఖం పొంగుకొచ్చింది రాంబాబుకి. పీడకలలా .... గుర్తువొచ్చింది జేబులో పొట్లాం. తీసి పారేద్దామా అనుకున్నాడుగానీ మళ్ళీ ఎందుకో మనసు ఒప్పలేదు.

ఆఫీసులో ఎప్పట్లాగా కలివిడిగా తిరగ లేక పోయాడు. పైగా పరధ్యాన్నానికి ఒకటి రెండు సార్లు పక్కవాళ్ళతో హెచ్చరికలు చేయించుకున్నాడు.

కడుపు మండుతోంటే నెమ్మదిగా లేచి కాఫీకి బయల్దేరాడు.

రోడ్డువార ఫుట్‌పాత్ మీద రకరకాల సీసాలు పరిచి పెట్టుక్కూర్చుందో బుక్కా అమ్మి. మెరుపులా ఏదో ఆలోచన వస్తే అటూ ఇటూ చూసి అటుకేసి అడుగులు వేశాడు. "ఇదుగో అమ్మీ! నీ దగ్గిర ...."

"ఏంటయ్యా? మీకేంటి కావాలి?"

సిగ్గుదొంతరలు తొలిగించుకుని అడిగేశాడు. "జుట్టు నల్లబడే మందు వుందా?"

బుక్కా మనిషి కళ్ళెత్తి నిగనిగలాడు తోన్న రాంబాబు జుత్తుకేసి ఆశ్చర్యంగా చూసింది. "మీకెందు కయ్యా జుట్టు మందు?"

"అబ్బే, నాక్కాదు .... నాక్కాదు. ఇదిగో చూడు" అంటూ గబగబా జేబులో పొట్లాం విప్పి భద్రంగా, రహస్యంగా చూపించాడు. "మా స్నేహితుడొకడికి తల ఇలా నెరిసింది. మందు దొరికితే కొనమన్నాడు."

"ఉందిలేయ్యా! బాగా పనిచేస్తది" అంటూ లోపలి బుట్టలోంచి వేలాడు పొడుగు నల్లటి సీసా తీసింది. "రూపాయిన్నర అవుతదయ్యా!"

"ఫర్వాలేదులే, ఇచ్చెయ్" పర్సుతీసి చిల్లర లెక్కపెట్టాడు. నిరుత్సాహపడ్డాడు.

"ఒక పావలా తక్కువైందమ్మా! రేపిస్తాలే. సీసా ఇయ్యి."

"మరేంటి చేస్తాను, తీసుకో అయ్యా!"

సీసా అందిస్తోన్న బుక్కా మనిషి కోరకుండా వరా లిచ్చే దేవతలా కన్పించింది.

"రేపు నీ పావలా నీకిచ్చేస్తాలే. ఇక్కడే వుంటా వుగా?"

సీసా అందుకుని పక్కజేబులో దూర్చేసుకున్నాడు.

"నయం. హోటల్‌కెళ్ళి వున్న డబ్బులు కాసిన్నీ తగలేశాను కాదు" వెనక్కి తిరిగి అంగలేసుకుంటూ ఆఫీసుకేసి నడిచాడు.

★ ★ ★

సాయంత్రం అద్దంలో చూస్తూ తల దువ్వు కోవాలంటే భయం వేసింది. జేబులో దువ్వెనతో గోడ వేపు తిరిగి క్రాపు సరి చేసుకుని సంతృప్తి పడ్డాడు.

గుమ్మంలో నిలబడి చూస్తూనే వుంది సావిత్రి. ఏమనుకుందోగానీ నెమ్మదిగా దగ్గిరికి వచ్చి జాలి పడుతూ చూసింది. "పొద్దున్న కోపం వచ్చి ఏమీ తిన కుండా వెళ్ళిపోయారు కదూ?"

"కోపం ఎందుకు? ఆఫీసుకి లేటైపోతోందని వెళ్ళి పోయాను."

రెట్టించకూడదనుకుంది సావిత్రి. "ఆ తెల్ల వెంట్రుక దిగులు ఇంకా పోలేదు కదూ?"

"అది ఊడేపోయింది. ఇంకా దిగులెందుకూ?"

"ఏమో! అందుకే అలా వున్నారనుకున్నాను. మా ఊళ్ళో ఒక అమ్మాయికి చిన్న తనంలోనే తలంతా పండులా నెరిసిపోయింది. బాల నెరుపని అలాగే నెరు స్తుంది కొంతమందికి. వాలుజడ వేసుకుంటే తెల్లగా నవ్వారు బద్దీలా అందమా, చందమా? పిల్లలంతా 'అమ్మమ్మా, అమ్మమ్మా, అని వేళాకోళాలు చేస్తే పాపం తెగ ఏడ్చేది."

రాంబాబుకి చాలా జాలేసింది. "అవును మరి, ఎవరికైనా ఏడుపొస్తుంది. మరి మందులేవీ వాడ

లేదా?"

"అబ్బో, బోలెడు వాడారు: ఎందుకొచ్చిన మందులు? డబ్బు దండగ. అవి వాడితే కుచ్చులు కుచ్చులుగా వున్న జుట్టు కూడా వూడి బట్టతల కూడా అయిపోతుంది. ఆ పిల్లకి అలాగే అవుతోంటే మందులన్నీ మానేసి విసుగెత్తి వూరుకున్నారు."

రాంబాబు మొహం నల్లబడిపోయింది. "అయితే మందులేవీ పని చెయ్యవా?. మరి ఆ పిల్లకి పెళ్ళయిందా?"

"మేనత్త కొడుకే చేసుకున్నాడు."

"ఇష్టంగా చూస్తాడా?"

"ప్రాణంలా చూసుకుంటాడు. జుట్టు రంగులు తెస్తూ వుంటాడు. నల్లరంగు వేసుకుంటే ఎంత అందంగా వుంటుందనుకున్నారూ ఆ పిల్ల!"

కలకల్లాడింది రాంబాబు ముఖ మండలం. ఏట్లో కొట్టుకుపోతోన్న వాడికి పూల పడవ అందినట్టనిపించింది. తనకి తోచనే లేదు. నిక్షేపంలా జుట్టు రంగులు వుండగా ఈ ఆలోచనలన్నీ ఎందుకూ?

"అయితే సావిత్రీ! ఎప్పుడైనా మనకీ తల నెరిస్తే అలా రంగు రాసుకోవచ్చుగా?"

"సింగినాదం! వయసు మళ్ళాక జుట్టు నల్లగా వుంచుకుంటే మాత్రం శరీరం పడుచుదైపోతుందా?"

నీళ్ళుగారిపోయాడు రాంబాబు. "ఛ! తన జుట్టు నెరిసిపోతోంటే సావిత్రికి బాధేలేదు! తలంతా పండులా నెరిసిపోతే ఇక జుట్టుతో ఎలా కేరింతలు కొడుతుందో! రోగం కుదురుతుందిలే! 'వయసు వస్తోందా, పోతోందా? మనమేం దేవతలమా అన్నిటికీ అతీతంగా వుండటానికి?' అంటుంది పైగా ఆరిందలాగ. అసలు దేవతలు మాత్రం ఎప్పుడూ అలా ఎలా వుండగలరు? వాళ్ళకి పుట్టగానే అమృతంతో ఉగ్గు పెడతారో యేమో? చావే లేకుండా కలకాలం జీవిస్తూ, వృద్ధాప్యం రాకుండా నిత్యయౌవనంగా వుండిపోతే, ఎంత సంతోషంగా వుండ వచ్చునో కదా? నలబయ్యేళ్ళన్నా నిండకుండానే జుట్టు నెరవడం .... పళ్ళు వూడడం .... ఛీ!

సావిత్రి ఏదో గుర్తొచ్చినట్టు వంటింట్లోంచి గబగబా వచ్చింది - "ఏదన్నా సినిమాకి వెళ్దామా? పనంతా అయి పోయింది."

"అబ్బా! నాకు తలనెప్పిగా వుంది. ఇప్పుడేం సినిమా?"

"మీ తలనెప్పి రహస్యం నాకు తెలుసు లెండి."

మిర్రుమంటూ చూశాడు రాంబాబు. "కావాలంటే నువ్వెళ్ళు. థియేటర్ దగ్గిరికి వస్తాను. నన్నిక విసిగించకు."

గొంతుదాకా కోపం వచ్చేసింది సావిత్రికి. గిర్రున వెనక్కి తిరిగి లోపలికి వెళ్ళిపోయింది.

అంత విసురుతోనూ వీధిన పడ్డాడు రాంబాబు. నడిచాడు .... నడిచాడు .... ఎక్కడికి పోతున్నాడో తెలీకుండా నడిచాడు. ఇవ్వాళో వెంట్రుక నెరిసింది. ఇంకో వారం రోజులకి .... పోనీ నెల్లాళ్ళకి .... పది వెంట్రుకలేనా నెరుస్తాయి. ఏడాది తిరిగొచ్చేసరికి ఓ లక్ష వెంట్రుకలు నెరిస్తే తలంతా .... నిజంగా తను తాత కాబోతోంటే, ఇంకా సినిమాలేమిటీ, సరదా లేమిటీ? అయిపోయింది. కాలం గతించి పోతోంది. ఇక ముసలి రోజులూ, దగ్గు తెరలూ, ఆఖరి క్షణాలూ, ఎగ వూపిర్లూ!

గంటనుంచీ గుడ్లు పెట్టుకుని చూస్తూ కూర్చున్నాడు పార్కు బెంచీమీద, వచ్చే పోయేవాళ్ళ తలల్ని ఎగాదిగా. పడుచు వాళ్ళు నవ్వుతూ, తుళ్ళుతూ, పడుచు వాళ్ళలాగే వున్నారు. బాగానే వుంది. ముసలి వాళ్ళు కూడా .... అదే .... తలలు నెరిసిన వాళ్ళు .... సిగ్గుల్లేకుండా ఇకిలించుకుంటూ నడవటం యేమిటీ! చిన్నతనాన్ని తలుచుకుంటే వాళ్ళ గుండెలు బద్దలు కావూ? వెర్రి వెధవలు, వాళ్ళకో గుండెవుండి ఏడిస్తేనా!

చీకటిపడింది. జనసమ్మర్దం తగ్గింది. వస్తూ పోతోన్న వాళ్ళ బుర్రలు తెలుపో, నలుపో, ఆనటం లేదు. నీరసంగా లేచాడు రాంబాబు.

తప్పదు. ఇంటికి చేరాలి. తిండీ, నిద్రా, ఇంకేముంది బతుకు? తలనెరిసి అప్పుడే ఓ పగలు గడిచి పోయింది. రేపటికి రెండు రోజులు! రేపటికి ఇంకోటి నెరవదు కదా?

కొయ్యబారిన కాళ్ళతో, శరీరం స్వాధీనంలో లేక, మనిషి తూలుతూ పోతున్నాడు అడ్డదిడ్డంగా.

"సిగరెట్టు అంటిస్తే?" అనుకున్నాడు కిళ్ళీబడ్డీ ఎదటికి వస్తూ. అయినా కాలు ముందుకి పడలేదు.

"ఇక మీరు కుర్రతనం మాని బుద్ధిగా వుండాలి" అని ఫక్కుమంది భార్యామణి, మనసులో. ఒళ్ళు మండి పోయింది రాంబాబుకి. విసురుగా అంగవేసి కొట్టు దగ్గిరికి వెళ్ళాడు.

సిగరెట్ కొని అక్కడే అంటించి నోట్లో పెట్టు కున్నాడు. ఎందుకో ఉత్సాహం చచ్చింది. సిగరెట్ విసిరిపారేశాడు సైడు కాలవలోకి.

సందు తిరుగుతోండగా సర్రుమంటూ దూసు కొచ్చిందో నల్లకారు. బాణంలా దూసుకొస్తూన్న ఆ కుర్రవాణ్ణి రెక్కపట్టి ఆపాలని రాంబాబు చటుక్కున వంగినా .... జరగనే జరిగింది! పిల్లవాడు కాస్తా కారు కెదురు పరిగెత్తాడు. కెవ్వుమన్నా పసికేక కారుశబ్దంలో మాయమైపోయింది.

పిల్ల వాడి చుట్టూ పోగైందో పెద్దగుంపు.

గుండెలు బాదుకొంటూ వచ్చిపడిందో కన్నతల్లి. కుర్రవాడి కాళ్ళకు దెబ్బలు తగిలాయని తేల్చాడో ధైర్య స్థుడు. నాలుగైదు టార్చిలైట్లు వెలిగాయి రోడ్డుమీద. స్పృహ లేకుండా పడివున్నాడు పసివాడు.

"అయ్యో, భగవంతుడా! నా బిడ్డకి నూరేళ్ళూ నిండిపోయాయా తండ్రీ? నా బిడ్డని తీసుకుపోతు న్నావా దేవుడా? నాయనా! నాయనా!" అని ఘొల్లు మంటూ ఏడుస్తోందా తల్లి.

"లేదమ్మా! పిల్లవాడు చచ్చిపోలేదు. ప్రాణం వుంది. కంగారు పడకండి. ముందు ఆస్పత్రికి నడ వండి."

అదే కారులో పిల్లవాణ్ణి పడుకోబెట్టి కన్నతల్లిని ఎక్కించి ఆస్పత్రికి సాగనంపారు హృదయాలున్న వాళ్ళు.

కారు కదిలిపోయింది. తలోమాటా అంటూ ఎవరి దారిన వాళ్ళు పోయారు జనమంతా.

తెల్లగా కళ్ళకు కట్టిందేదో రోడ్డువార. వణుకు తూన్న చేతులతో ఒంగి దాన్ని అందుకున్నాడు రాంబాబు. చిన్ని కాలిజోడు. కొత్తగా తెల్లగా అక్షరాలైనా అరక్కుండా వుంది రబ్బరు. ఇది .... ఇది .... ఆ కుర్ర వాడిదా? వాడి కాళ్ళకి జోళ్ళు వున్నాయా? అప్ర యత్నంగా చూపులతో గాలించాడు, రెండో జోడు కోసం. కన్పించలేదు. చేతుల్లో వున్న ఆ ఒక్కజోడూ ఒదలబుద్ధి కాలేదు. భారంగా అడుగులు ముందుకు వేశాడు రాంబాబు.

మరి .... ఆ కుర్రవాడు ఇక కాళ్ళకి జోళ్ళు వేసు కోడా? కంపించిపోయాడు రాంబాబు, నడవటం మాని నించున్నాడు. అసలు వాడు బతుకుతాడా, చచ్చిపోతాడా? బతికితే కాళ్ళులేకుండా కుంటివా డౌతాడా? ఐదేళ్ళయినా వుండని పసిబిడ్డకి కాళ్ళు లేకపోతే జీవితమంతా ఎలా గడుపుతాడు? జోళ్ళెలా వేసుకుంటాడు? కాలేజీకెలా నడిచి వెళ్తాడు? సైకిలెలా తొక్కుతాడు? భార్యని షికారుకెలా తీసికెళ్తాడు? ఎలా? అవన్నీ ఎలా? నూరేళ్ళు జీవించినా ఇక ఏం అనుభ విస్తాడు? ఏం సుఖపడతాడు? ఎక్కడో ఒక మూల కూర్చుని పాక్కుంటూ, పాక్కుంటూ .... మహా అయితే చంకల కింద కర్రలు పెట్టుకుని ...." రాంబాబు కళ్ళల్లోంచి కన్నీటిబొట్లు జారిపడ్డాయి.

ఆ చిన్న జోడు భద్రంగా పట్టుకుని ఇంటితలుపు తట్టాడు. సావిత్రి నవ్వుతూ నించుంది.

"ఆ చెప్పేవిటి? ఎక్కడిదీ?"

"చెపుతాలే."

"మిమ్మల్ని హాస్యాలతో, వెటకారాలతో ఏడి పించాను. అదే బాధగా వుంది నాకు" దీనంగా చూసింది.

"ఏమిటీ? ఏవైంది? దేని సంగతి?"

"అదే! మీ జుట్టు నెరిసిందనీ ...."

లోపలికి పోతోన్న రాంబాబు వెనక్కి చూశాడు "వెధవ జుట్టు .... నెరవనియ్! తలంతా ముగ్గుబుట్టలా పండిపోనీ! నాకేం బాధ లేదు. తీరిగ్గా కూర్చుని అన్ని టికీ బాధపడటం నేర్చాను. బుద్ధిలేని పని కాకపోతే తల నెరిసినందుకు ఏడ్చుకోడం ఏంటి? జీవితాల్లో ఎంతెంత కష్టాలున్నాయి!"

ఆశ్చర్యంగా చూసింది సావిత్రి.

ఆ మాటలు నిజంగా అంటున్నట్టే కన్పించాడు రాంబాబు.

"అసలేం జరిగిందో తెలుసా సావిత్రీ ఇందాక?"

[1964 జూన్ 'జ్యోత్స్న' మాస పత్రిక నుంచి]★